www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 జులై 2025
5
కాకినాడ



జనసేన నాయకుడు రాజశేఖర్ మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

జనసేన నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బిక్కిన సాయి తనయుడు బిక్కిన రాజశేఖర్ బుధవారం సాయంత్రం కాకినాడలో ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో మతి చెందారు. ఈయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. స్థానిక అయోధ్య రామపురంలోని ఆయన స్వగృహానికి పలువురు విచ్చేసి రాజశేఖర్ తండ్రి బిక్కిన సాయిని ఎంఎల్‌సి నిమ్మకాయల చినరాజప్ప, కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బదుగు శ్రీకాంత్, కంటే బాబు, గోలి వెంకటఅప్పారావుచౌదరి, జనసేన నాయకులు సరోజ వాసు, మంచం సాయిబాబు పరామర్శించారు.



సాయిని పరామర్శిస్తున్న చినరాజప్ప

సమస్యల వలయంలో పిఠాపురం


- డిసిఎం ఇలాకాలో పరిష్కారానికి నోచని వైనం
- ప్రకటనలకే పరిమితమైన అభివృద్ధి
- అమలుకు నోచుకోని పవన్ హామీలు

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు సైతం నెరవేరిన దాఖలాలు. పలు సమస్యలను నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. పిఠాపురం అభివృద్ధి ప్రకటనలకే పరిమితమైంది. ఫలితంగా ప్రజలు సమస్యలతో సహజీవనం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. పిఠాపురాన్ని దేశం అంతా చూసేలా మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానిని పదేపదే చెప్పుకొచ్చారు. కాని ఆ మేరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడిన దాఖలాలు లేవు.

:: ప్రజాశక్తి - పిఠాపురం ::

గంగపుత్రుల గుండె 'కోత'

నియోజకవర్గంలో ఉప్పాడ కొత్తపల్లి మండలంలో గంగపుత్రుల సమస్యలకు పరిష్కారం నేటికీ దొరకలేదు. ఏటా సముద్రకోత వల్ల గ్రామాలు సముద్రంలో కలిసిపోతున్నాయి. ఇక్కడ జియోట్యూబ్ నిర్మాణం చేపట్టి కోతను అరికడతామని ఎన్నికల సమయంలో పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు. కాని నేటికీ ఒక్క రూపాయి కూడా నిధులు సమకూర్చలేకపోయారు. తుపానుల సమయంలో అలలతాకిడికి బీచ్‌రోడ్డు సైతం కోతకు గురవుతుంది. పెద్దపెద్ద బండరాళ్లు బీచ్‌రోడ్డుపైకి చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఆ సమయంలో అధికారులు రాళ్లను తొలగించి చేతులు దులిపేసుకోవడం తప్ప శాశ్వత పరిష్కారం చూపిన పరిస్థితి లేదు. తాజాగా ఉప్పాడ శివారు మాయాపట్నం, సూరాడపేట మత్స్యకార గృహాల్లోకి సముద్రపు నీరు చేరింది. తక్షణ చర్యలుగా తాత్కాలిక కాలువలు తవ్వించి నిల్వ ఉన్న సముద్రపు నీటిని తొలగిస్తున్నారు. ఇసుకను వేసి అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపరితల ద్రోణి నేపథ్యంలో తీరం వెంబడి ఉన్న మత్స్యకార గృహాల్లోకి సముద్రపు నీరు చేరుకోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు, మత్స్యకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జియో ట్యూబ్ రెండు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడంతో అలల తాకిడి నుంచి కోతకు గురికాకుండా నివారణ సాధ్యమైంది. జియో ట్యూబ్ పూర్తిగా ధ్వంసం కావడంతో కొనపాపపేట, సూరాడపేట, మాయాపట్నం, ఉప్పాడ పాత బజార్ తదితర ప్రాంతాలకు ఏటా ముంపు కష్టాలు తప్పట్లేదు.



గతేడాది తుపాను సమయంలో యు.కొత్తపల్లి మండలం కొనపాపపేటలో కోతకు గురైన మత్స్యకారుని గృహం

కానరాని టెంపుల్ టూరిజం

పిఠాపురంలో చాలా దేవాలయాలు ఉన్నాయని, ఇక్కడ టెంపుల టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని, ఫలితంగా ఇక్కడ యువతకు ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడతాయని పలుమార్లు పవన్ చెప్పుకొచ్చారు. ఆయన అధికారంలోకొచ్చి ఏడాది దాటినా టెంపుల్ టూరిజం అభివృద్ధికి చేసిన పనులు శూన్యం. ప్రకటనలో ప్రణాళికలు చూపిస్తున్నా.. ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడట్లేదు. ప్రసిద్ధి గాంచిన పాదగయ క్షేత్రాన్ని ఏడాది కాలంలో అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. పాదగయతో పాటూ పంచమాదవ క్షేత్రాల్లో ఒకటైన శ్రీ కుంతి మాధవ స్వామి వారి దేవస్థానం, దత్తాత్రేయుడు జన్మస్థానం అయినటువంటి శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానంతో పాటు, అనేక దేవాలయాలతో ఆధ్యాత్మిక కేంద్రంగా విరజిల్లుతోంది. ఇక్కడికి ఇతర రాష్ట్రాల నుంచి అనేక దూర ప్రాంతాల నుంచి భక్తులు నిత్యం పిఠాపురానికి వస్తున్నారు. రోజురోజుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నా ఆ మేరకు వసతులు ఉండట్లేదని పలువురు భక్తులే చెబుతున్నారు.

ఎన్నికల వేళ ఇచ్చిన మరికొన్ని హామీలు

- పిఠాపురం - ఉప్పాడ రైల్వే గేట్ వద్ద ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణించి ఏడాదిలో పూర్తిచేస్తామన్నారు. కాని నేటికీ పనులు ప్రారంభం కాలేదు.
- పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తామని తెలిపారు. కనీసం ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను మెరుగురిచిన దాఖలాలు లేవు.
- కాకినాడ సెజ్ రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేసి, పరిశ్రమలు ఏర్పాటున చేస్తామని చెప్పారు. ఏడాదిగా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు.
- గొల్లప్రోలు మండలంలో సెరికల్చర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని, విత్తన కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కోల్డ్ స్టోరేజీ హామీ కూడా నీటి మూటగానే మిగిలింది.



గతేడాది ఏలేరు ఉగ్రరూపానికి ముంపునకు గురైన ఇళ్లు

సుద్ధగడ్డ, ఏలేరు ఆధునికీకరణ ఎప్పుడు?

నియోజకవర్గంలో సుద్ధగడ్డ కాలువ, ఏలేరు కాలువలు ప్రధాన సాగునీటి వనరులుగా ఉన్నాయి. వీటికి తోడు పిబిసి కెనాల్ ఉంది. ఇవి ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో ప్రతి ఏటా రైతులు పంటలను నష్టపోతున్నారు. గతేడాది ఏలేరుకు వరద పోటెత్తింది. దీంతో ఏలేరు పరివాహక గ్రామాలు, పంటపొలాలు పూర్తిగా నీటి మునిగాయి. వారం రోజుల పాటు ఈ ముంపు కొనసాగింది. పలుచోట్ల గండ్లు సైతం పడ్డాయి. వీటిని తాత్కాలికంగా పూడ్చి చేతులు దులిపేసుకున్నారు. సుద్ధగడ్డను అసలు పట్టించుకున్న దాఖలాలు లేవు. సుద్ధగడ్డ కాలువ కారణంగా ఎక్కువగా గొల్లప్రోలు మండలంలో పలు గ్రామాలు, పొలాలు ముంపునకు గురవుతున్నాయి. గతేడాది తరహా వానలు, వరదలు వస్తే ముంపు తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన క్లోజర్ పనులు

కాలువల్లో క్లోజర్ పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి. పిబిసి పరిధిలోని పిఠాపురం మండలం చిత్రాడ, యు.కొత్తపల్లి మండలం ఇసుకపల్లి, నాగులాపల్లి, యండపల్లి, గొల్లప్రోలు, మండల పరిధిలో మల్లవరం, ఎవి.నగరంలలో రూ.2.55 కోట్లతో 73 పనులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 53 పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నా చాలా చోట్ల నత్తనడకన సాగుతున్నాయని రైతులు అంటున్నారు. ఏలేరు డివిజన్ పరిధిలో రౌతులపూడి, తుని, శంఖవరం, ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, కాకినాడ రూరల్‌లో కొంత, యు.కొత్తపల్లి, తొండంగి, గొల్లప్రోలు మండలాల్లో రూ.11.31 కోట్ల విలువైన 299 పనులు మంజూరయ్యాయి. ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ పేరుతో జరుగుతున్న ఈ పనుల్లో కూడా పురోగతి కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. వర్షాకాలం వచ్చినా నేటి వరకూ 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు.



పిఠాపురంలో పూడుకుపోయిన కాలువ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవాణా శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అధికారులు

రవాణా శాఖ బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

సిబ్బంది, వాహనాలు, ఆధునిక సాంకేతికలతో రవాణా శాఖను బలోపేతం చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖామంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌టిఒ కార్యాలయంలో రవాణా శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శాఖా పరమైన కార్యక్రమాల అమలు ప్రగతి, వాటి నిర్వహణలో అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో పారదర్శకత, సమర్థ సేవల కల్పన, ఆదాయ వృద్ధి, రహదారి భద్రత తదితర అంశాలపై ఆయన అధికారులకు మార్గదర్శకాలను జారీ చేశారు. రవాణా శాఖలో ఖాళీగా ఉన్న ఆర్‌టిఒ, డిటిసి, ఎఒ, ఎంవిఐ, ఒఎంవిఐ, ఇతర కేడర్ పోస్టులను భర్తీ చేసి, వాహనాలు, ఇతర కనీస అవసరాలను కల్పించి శాఖకు పూర్వ వైభవాన్ని తెస్తామన్నారు. గ్రీన్ టాక్స్ రద్దు చేయడం వల్ల ఆదాయ సేకరణ తగ్గినప్పటికీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడం, ఫీజులు, జరిమానాలను సమర్ధవంతంగా వసూలు చేయడం ద్వారా ఆదాయ సేకరణ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఓవర్ లోడింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లను నిరోధించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. ఈ సమావేశంలో రహదారి భద్రత సందేశాలతో రవాణా శాఖ ప్రచురించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించి రాష్ట్రాన్ని జీరో ఏక్సిడెంట్ రాష్ట్రంగా మలచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రవాణా శాఖను కేవలం ధనార్జన శాఖగా మాత్రమే కూటమి ప్రభుత్వం చూడటం లేదని, సుమారు రూ.130 కోట్లు ఆదాయం కోల్పోతున్నా వాహనదారుల సంక్షేమాన్ని పరిగణలోకి తీసుకుని గ్రీన్‌టాక్స్‌ను రద్దు చేసిందన్నారు. ఆగష్టు-15వ తేదీ నుంచి మహిళలకు ఆర్‌టిసి బస్సులలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు సన్నాహాలు చేపట్టామని, ఇందుకు అవసరమైన మేరకు సుమారు 1400 బస్సులు ఆర్‌టిసి కొనుగోలు చేస్తుందన్నారు. సుమారు 2000 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి ఆర్‌టిసికి పూర్వ వైభవం తెస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, జిల్లా రవాణా అధికారులు కె.శ్రీధర్(కాకినాడ), ఆర్.సురేష్(తూగో), డి.శ్రీనివాస్(బిఆర్‌ఎ-కెఎస్), ఆర్‌టిఒ జివి.శివారెడ్డి, ఎంవిఐలు, పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతో ముద్రగడ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని ఆయన సతీమణి ముద్రగడ పద్మావతి అన్నారు. బుధవారం మండలంలో రాచపల్లి గ్రామంలో జరిగిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికత్స పొందుతున్నారని అన్నారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో నా భర్త ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

వ్యభిచార గృహ నిర్వాహకులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

పెద్దాపురంలో వ్యభిచార గృహం నడుపుతున్న భారతీని, ఆమెకు సహకరించిన పోలీసులను వెంటనే అరెస్ట్ చేయాలని అత్యాచార, లైంగిక వేధింపుల వ్యతిరేక పోరాట వేదిక డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణీ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణీ మాట్లాడుతూ ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని నిందితుల్ని అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఐక్యవేదిక తరపున సంఘాల నాయకులు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆడపిల్లల జోలికొస్తే తాట తీస్తానని గతంలో చెప్పారని, కానీ ఆయన ఇప్పుడు ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. డిప్యూటీ సిఎం కార్యాలయానికి బాధితురాలు వెళ్లి తన ఘోడును చెప్పుకున్నా నేటికి స్పందన లేకపోవడం దారుణమన్నారు. ఇంత దారుణమైన ఘటనలు బయటకు వచ్చినప్పటికీ ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. హోంమంత్రి కనీసం స్పందించ లేదని విమర్శించారు. బాధితురాలకి నేటికీ రక్షణ కల్పించలేదని, నష్టపరిహారం, పునరావసం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని ఈ రౌట్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి, జమాతే ఇస్లామీ నాయకులు నజ్మా, షహనాజ్, రుక్సానా, ఫోజియా, శ్రామిక మహిళా సంఘం నాయకులు సిహెచ్.పద్మ, సామాజిక కార్యకర్త హసన్న షరీఫ్, జెఐహెచ్ నాయకులు సలీం భాష, ఐద్వా టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.భూలక్ష్మి, కె.నాగజ్యోతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణీ

పోలవరం పనులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - తుని

పోలవరం ఎడమ కాలువ పనులపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు, పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. బుధవారం మండలంలోని కుమ్మరిలోవ వద్ద జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 120 కిలోమీటర్ల పరిధిలో జరుగుతున్న పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. గత 12 సంవత్సరాలుగా వివిధ కారణాలతో ఆగిపోయిన పోలవరం ప్రధాన ఎడమ కాలువ పనులు తిరిగి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. కుమ్మరిలోవ కాలనీవాసుల సహకారంతో ఇప్పటివరకు 30 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించడం జరిగిందని తెలిపారు. సుమారు 50 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు పనులు జరగాల్సి ఉందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షిస్తున్నందున లక్ష్యానికి అనుగుణంగా పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కాలనీవాసుల చిన్న చిన్న సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి అవసరమైనా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ కె.శ్రీరమణి, పోలవరం ఎడమ కాలువ ఎస్ఇ ఏసుబాబు, ఇఇ గోవిందరాజు, తహశీల్దార్ జివి.ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



పోలవరం కాలువ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

వ్యభిచార గృహాలపై పోలీసుల దాడులు

ఇద్దరిపై కేసుల నమోదు
ఇద్దరు కానిస్టేబుల్స్ సస్పెన్షన్
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి పెద్దాపురం, కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఇటీవల సంచలనం రేపిన వ్యభిచారం కేసులో ఎస్‌పి బిందు మాధవ్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం డిఎస్‌పి శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పోలీసులు వ్యభిచార గహాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు మహిళలపై కేసులు నమోదు చేసినట్టు డిఎస్‌పి తెలిపారు. వక్కలంక వారి వీధి, మసీదు వీధి, కట్టమూరు పుంత ప్రాంతాలలో ఒకేసారి వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మసీదు వీధికి చెందిన ఒక మహిళను, కట్టమూరు పుంతకు చెందిన ఒక మహిళను మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లలో ఇద్దరు వ్యభిచార వృత్తిలో ఉన్న మహిళలకు సంబంధించిన అంశం వైరల్ అయ్యిందన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇద్దరు పోలీసుల సస్పెండ్

వ్యభిచార గహ నిర్వాహకురాలికి సహకరించారనే అభియోగాలపై కానిస్టేబుల్, హోమ్‌గార్డును సస్పెండ్ చేసినట్టు ఎస్‌పి బిందు మాధవ్ తెలిపారు. పెద్దాపురం పోలీస్ అధికారులపై తదుపరి క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేసినట్టు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ జి.శివ రామకష్ణ, హోమ్‌గార్డ్ సిహెచ్.శివ కృష్ణను సస్పెండ్ చేశామని, పెద్దాపురం ఎస్ఐ వి.మౌనిక, ఇతర అధికారులపై క్రమశిక్షణ చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామన్నారు. పెద్దాపురానికి చెందిన భారతి అనే వ్యభిచార గహ నిర్వాహకురాలిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలో ఆమెను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడతామని ఎస్‌పి చెప్పారు. ఈ కేసు విచారణకు ప్రత్యేక బృందం నియమించినట్టు తెలపారు.



వ్యభిచార గృహాలపై దాడులు చేస్తున్న పోలీసులు

గర్భిణులకు పౌష్టికాహార అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృత్వం కార్యక్రమంలో బుధవారం పెద్దాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ పరీక్షల నిమిత్తం, వైద్య సేవల నిమిత్తం వచ్చిన గర్భిణులకు పోషకాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన కంటదేవ వెంకటరమణమూర్తి సతీమణి ప్రేమావతి జ్ఞాపకార్థం డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ మానస సతీష్‌కుమార్, స్రవంతి సహాయ సహకారాలతో 150 మంది గర్భిణులకు పౌష్టికాహార వంటకాలతో అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌కుమార్, వట్టికూటి సత్య, శ్రీను, సత్య ప్రశాంత్, నవీన్ నాని, వడ్డి సత్యనారాయణ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికారం అందిస్తున్న నిర్వాహకులు

రోడ్డు ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - కోటనందూరు

కోటనందూరు సెంటర్లో రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఆర్ అండ్ బి స్థలాల్లో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న ఆక్రమణలను తొలగించారు. బుధవారం ఎస్ఐ టి.రామకృష్ణ పర్యవేక్షణలో పంచాయతీ, పోలీసు సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు సాగించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం కెఇ.చిన్నయ్యపాలెం గ్రామంలో ఆటో డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, రికార్డులు తప్పనిసరిగా ఉండాలని, ఆటోలో సౌండ్ బాక్స్‌లు ఉండరాదని, నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపర్తి, చిన జగ్గంపేట గ్రామాలకు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలకు ఆర్‌డిఎస్ఎస్ స్కీంలో నూతన విద్యుత్ లైన్లు నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంఎల్ఎ జ్యోతులకు సత్కారం

ప్రజాశక్తి - జగ్గంపేట

లారీలకు విధించే గ్రీన్‌ట్యాక్స్ రద్దు చేసినందుకు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను జగ్గంపేట ఏరియా లారీ యూనియన్ సభ్యులు సత్కరించారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మారిశెట్టి రాధా, ప్రెసిడెంట్ దవులూరి ఈశ్వరరావు, సభ్యులు ఆయనను సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పాండ్రంగి రాంబాబు, అసోసియేషన్ సభ్యులు మారిశెట్టి గణేశ్వరరావు, తిరుమలరాజు మురళి రాజు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతులను సత్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఘనంగా మరిడమ్మ సంబరం


ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక బంగారమ్మ గుడి వీధి శంకరయ్యపేట వాసులు మరిడమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంబరంలో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణ మధ్య బండ్ల వేసాలు యాత్రికులను, ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే ప్రాచీన కళారూపాలకు ఆలవాలమైన పెద్దపులాటలు, కాళికా, గరగల నృత్యాలు, కోయ డ్యాన్సులు, సాము గరిడీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సంబరాన్ని కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



బండ్ల వేషాల్లో కళాకారులు

కార్టూ'నిజం'



మెడికవర్‌లో వరల్డ్ బ్రెయిన్ డేపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ న్యూరో సర్జన్ డా. చందు లింగోలు మాట్లాడుతూ మానవ శరీరంలో అతి కీలక పాత్ర పోషించే అవయవాలలో మెదడు ఒకటి అని అన్నారు. ప్రస్తుత కాలంలో తీవ్రమైన ఒత్తిడి కారణంగా అనేక రకాల మెదడు సంబధిత సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మెదడు రుగ్మతల భారాన్ని తగ్గించడానికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమన్నారు. శరీరంలో ఏదైనా మెదడు రుగ్మత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మెదడుకు సంబంధించిన అన్ని వ్యాధులూ ప్రమాదకరమని, అయితే అందులో బ్రెయిన్ ట్యూమర్ల కేసులు చాలా ఎక్కువగా ఉంటాయనివివరించారు. ఎవరికైనా ఉదయం నిద్ర లేవగానే విపరీతమైన తలనొప్పి ఉంటే బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలన్నారు. ఈ పరిస్థితిలో వైద్యులను సంప్రదించి వెంటనే చికిత్స తీసుకోవాలన్నారు. ప్రముఖ న్యూరో ఫిజిషన్ డాక్టర్ కృష్ణ హస్కర్ మాట్లాడుతూ గతంలో 50 ఏళ్లు దాటిన వారు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యేవారన్నారు. కానీ ప్రస్తుత కాలంలో 20 ఏళ్ల నుంచే ఈ తరహా సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోందన్నారు. యువత ఎక్కువగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడానికి ధూమపానం, మద్యపానం, జీవన విధానంలో మార్పు, రక్తపోటు, ఊబకాయం, గుండె జబ్బులు, ఈస్ట్రోజన్ కలిగిన హార్మోన్ థెరపీలు, గర్భనిరోధక మాత్రలు వాడిన మహిళల్లో సైతం స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ మెదడుకు సంబంధించిన ఏ విధమైన సమస్యలు ఉన్నా వెంటనే మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న మెడికవర్ వైద్యులు



తిలక్, ఆజాద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఆదిత్యలో తిలక్, ఆజాద్‌ల జయంతి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బాలగంగాధర తిలక్, చంద్రశేఖర్ అజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడుతూ స్వరాజ్యం కోసం బాలగంగాధర తిలక్, ఆజాద్ తమ ప్రాణాలను ఫణంగా పెట్టారని అన్నారు. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం వేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలలు సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎస్ఎస్ఎస్ పిఒలు తేజేశ్వరరావు, డి.అశ్విని వాలంటీర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని జగన్నయ కులపాలెం-తాళ్లపాలెం రోడ్డు మధ్యలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తాళ్ల పొలం గ్రామానికి చెందిన వను కష్ణ(48) మృతి చెందారని ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

విధి నిర్వహణలో లైన్‌మ్యాన్ మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లికి చెందిన విద్యుత్ లైన్‌మ్యాన్ బిళ్ళ చంద్రరావు(46) విధి నిర్వహణలో అస్వస్థతకు గురై బుధవారం మృతి చెందారు. ఆదివారం రాత్రి కరెంటు సరఫరా నిలిచిపోవడంతో పునరుద్ధరించడానికి వెళ్లి పాశర్లపూడి ఏటిగట్టు ప్రాంతంలో పడిపోయాడు. సహచర లైన్‌మ్యాన్ అమలాపురంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మతి చెందాడని తెలిపారు అతని కుటుంబ సభ్యులను ఎపిఇ టిడిసిఎల్ ఉద్యోగులు పరామర్శించారు

చోరీ కేసులో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి -కొవ్వూరు

మోటార్ సైకిల్ చోరీకి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరకి ఎజెఎఫ్‌సిం జడ్జి కె.నాగలక్ష్మి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. ఈ ఏడాది పట్టణంలో రెండు వేర్వేరు చోట్ల బైకుల చోరీకి పాల్పడ్డారన్నారు. ఈ కేసులో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ శిక్ష విధించినట్టు ఆయన తెలిపారు.

బైకుల చోరీ కేసులో..

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం పోలీస్ స్టేషన్లో 2024లో బైక్ దొంగతనాల కేసులో బండారు రాము అనే నిందితునికి రాజమహేంద్రవరం ఏడో అదనపు కోర్టు నేరస్తుడికి ఏడు నెలల జైలు శిక్ష విధించారు. ముద్దాయి అరెస్ట్ అయిన నాటి నుండి నేటి వరకు రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉండగా ఆ కాలాన్ని (7 నెలలు)శిక్ష కాలంగా కోర్టు పరిగణించినట్టు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన: మంత్రి

ప్రజాశక్తి - కాకినాడ, రౌతులపూడి

రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని 39వ డివిజన్లోని చీడీలపొరలో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ మల్లిపూడి నాగ దీపిక అధ్యక్షతన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను స్థానిక ప్రజలకు వివరించారు. అనంతరం గర్భిణులకు జరిగిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పౌష్టిక ఆహార కిట్లు అందించి ఆశీర్వదించారు. ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేసిన సుమారు రూ.7 లక్షల విలువ చేసే చెక్‌లను అందజేశారు. అనంతరం మోటార్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లిపూడి వీరు, సుంకర పావని, తుమ్మల రమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే రౌతులపూడి మండలంలోని ఎస్‌పైడిపాల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో నెలకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎఎంసి ఛైర్మన్ బద్దిమని రామారావు, టిడిపి మండల అధ్యక్షులు తామర సత్యనారాయణ, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల సాంబశివరావు, మాజీ సర్పంచ్ గొళ్ళు పెద్ద దివాణం, తదితరులు పాల్గొన్నారు.

రూ.26 వేలు పలికిన పులస

ప్రజాశక్తి - యానాం

గోదావరి నదికి వరదలు వస్తుండడంతో యానాంలో పులసల సందడి కొనసాగుతోంది. ప్రస్తుతం వేలంలో పులస చేపలు భారీ ధర పలుకుతున్నాయి. బుధవారం జరిగిన పాటలో 2 కిలోల పులస వేలంలో రూ.26 వేలకు భారీ ధర పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఈ సీజన్‌లో పులస చేపల కోసం చాలా మంది ఆసక్తి కనబర్చడం ఆనవాయితీ. ఈ సీజన్‌లో తొలి పులస చేప యానాం ఫిష్ మార్కెట్‌లో రూ.4 వేలు ధర పలికింది. కాని అది పులస కాదు విలస అని అపోహలు ఉన్నాయి. అయితే తర్వాత వచ్చే చేపలకు పులస ప్రియులు వేలంలో పోటీ పడడంతో మరో చేప రూ.15వేలు పలికింది. తర్వాత దొరికిన రెండు పులస చేపలు రూ.13 వేలు, రూ.18 వేలుగా అమ్ముడయ్యాయి. ఈ వారంలో మరో చేప రూ.22 వేల ధర పలికింది. అయితే తాజాగా 2 కిలోల పులస చేప రూ.26 వేలు పలికింది. ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన బెజవాడ సతీష్ రూ.26 వేలకు పులసను దక్కించుకున్నారు. యానాంలో పులసల సందడి మరికొన్ని రోజుల పాటు కొనసాగనుంది. గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలో పులస సీజన్ ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది గోదావరికి వరద నీటి తాకిడి పెరగడంతో పులస చేపల సీజన్ మొదలైంది. నదికి ఎర్ర నీరు ఉధృతంగా రావడంతో పులసలు ఎదురీదుతూ వస్తున్నాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: జడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి - తాళ్లరేవు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్‌పి సిఇఒ లక్ష్మణ్ ఆదేశించారు. బుధవారం మండలంలోని కోరంగి పంచాయతీ సీతారాంపురంలో ఆయన పర్యటించారు. ప్రతాప్ నగర్‌లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఇంటిలో చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తగా పంచాయతీ అందజేసిన డస్ట్ బిన్ లలో వేయాలని సూచించారు. ఏ ప్రాంతానికి ఏ రోజు, ఏ సమయంలో చెత్త సేకరణ వాహనాలు వస్తాయో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగాలని అన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి జిల్లా అధికారులు పర్యటనలు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వం నిర్దేశించిన బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగంగా పి-4 సర్వేలో సీతారాంపురంలో గుర్తించిన తిరునగరి సుగుణ కుటుంబాన్ని సందర్శించి కుటుంబ జీవన వవిధానం, ఆర్థిక పరిస్థితులు, పోషణ వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చిరు వ్యాపారం నిమిత్తం ఆర్థిక సాయం చేయడంతో పాటు ఆరోగ్య సమస్యలతో సతమతమౌతున్న కుమారుని వైద్యం అందించడానికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి విజెవి. రమణ, సర్పంచ్ పెయ్యల మంగేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు ఇచ్చేముందు తెలియదా..?

ప్రజాశక్తి - సామర్లకోట

హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూటమి పార్టీల నేతలకు తెలియదా? అని పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ప్రశ్నించారు. బుధవారం పట్టణ వైసిపి విస్తృతస్థాయి సమావేశం పట్టణ వైసిపి అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత వైఎస్.జగన్‌కే దక్కుతుందని అన్నారు. సంపద సృష్టిస్తామని కబుర్లు చెప్పి నేడు హామీలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రులు మాట్లాడటం దారుణమన్నారు. ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వ వైఫల్యం ప్రజలకు అర్థం అయిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ప్రజలు తగిన బుద్ధిచెప్పటానికి సిద్ధంగా ఉన్నారని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, నాయకులు దవులూరీ సుబ్బారావు, ఆవాల లక్ష్మీనారాయణ, మన్యం చంద్రరావు, ఇరుసుమల్ల సాయి, సేపేని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలి: డిపిఒ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో పారిశుధ్య సక్రంగా నిర్వహించి మోడల్ పంచాయతీగా గండేపల్లి పంచాయతీని తీర్చిదిద్దాలని డిపిఒ కె.రవికుమార్ అన్నారు. బుధవారం గడేపల్లిలో చేపట్టిన పారిశుధ్య పనులు ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో ఆయన మాట్లాడి తడి, పొడి చెత్త సేకరణపై పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు గ్రామంలో పంచాయతీ ద్వారా చేసే పనులను పరిశీలించి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శి ఫణీంద్రకుమార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కె.బాలమణి, డిప్యూటీ ఎంపిడిఒ ఐఎన్.శ్రీనివాస్, డిపిఆర్‌సి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - పిఠాపురం

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మాజీ ఎంపి వంగా గీత విమర్శించారు. బుధవారం స్థానిక రైస్ మిల్లర్లు అసోసియేషన్ కల్యాణ మండపంలో వైసిపి మండల అధ్యక్షులు అడపా రఘు అధ్యక్షతన మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో పెన్షన్ ఇవ్వడం తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. బటన్ నొక్కడం పెద్దపనా అంటూ గతంలో విమర్శించిన వారు ఇప్పుడు ఆ బటన్ నొక్కలేక చేతులెత్తేసారన్నారు. బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందించడం కేవలం జగన్‌కే సాధ్యమన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసేందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిట్ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి - కాకినాడ

ఎంఎల్‌సి అనంతబాబు తన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఉదంతంపై కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం హర్షణీయమని టిడిపి నాయకుడు సరిపెల్ల రాజేష్ అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో దళితులపై దాడులు, హత్యలు చేయడం, లేకపోతే వారే ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించడం పరిపాటిగా మారిందన్నారు. దళితులపై జరిగిన దాడులలో డాక్టర్ సుధాకర్, వీధి సుబ్రహ్మణ్యం, ఒక రిపోర్టర్‌కు శిరోమండనం చేయించడం ఇలా ఎన్నో ఉన్నాయన్నారు. సుబ్రహ్మణ్యం హత్య చేసిన విధానంపై సిట్ వేసి అసలు హత్య వెనక ఎవరెవరున్నారు? ఏం జరిగింది అనేదానిపై కూటమి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ హత్యపై మొదటి నుంచి నిస్పక్షపాతంగా పోరాడుతున్న న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పలివెల రవి అనంతకుమార్, కొల్లాబత్తుల అప్పారావు, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.


ఆన్లైన్ నమోదులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజు

పారదర్శకంగా అసెస్మెంట్లు నమోదు చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

స్వర్ణ పంచాయతీల ద్వారా అన్ని రకాల అసెస్మెంట్‌లు పారదర్శకంగా ఆన్లైన్ నమోదు చేయాలని ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీలో జరుగుతున్న నమోదులను ఆయన పరిశీలించారు. అలాగే కంప్యూటర్ ఆపరేటర్లను జరిగిన, జరగబోయే నమోదులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెస్మెంట్లు, పన్నులు, ఇంటి అడ్రస్‌లు, వారి పేర్లు నమోదుల విషయంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే అనధికార లే ఔట్ల జోలికి పోవద్దని కార్యదర్శులకు ఆదేశించారు. అలాగే స్వర్ణ పంచాయతీని ప్రణాళికబద్ధంగా నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

రావులమ్మకు సారె సమర్పణ

ప్రజాశక్తి -అంబాజీపేట

వాకలగరువు గ్రామ దేవత శ్రీ రావులమ్మ తల్లి అమ్మవారికి బుధవారం గ్రామ ఆడపడుచులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆషాడం సారె సమర్పించారు. యాత్రికుల కోలాహం నడుమ గ్రామ ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలని కోరుతూ ఆషాడం సారె సమర్పించారు. రావులమ్మ ఆలయాన్ని పూలతో అలంకరించారు. పలు రకాల పండ్లు, స్వీట్లు, చలివిడి పానకాలు, వడపప్పు సమర్పించారు.

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని నియోజకవర్గ మైనారిటీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం నుంచి కోనసీమ జిల్లా అమలాపురం వెళ్లాలంటే కోటిపల్లి గోదావరి దాటి అక్కడ నుంచి అమలాపురం వెళ్ళి కలెక్టర్ , జిల్లా అధికారులను కలవాలంటే కనీసం 2 గంటలు సమయం పడుతుందన్నారు. యానాం బైపాస్ నుండి అమలాపురం వెళ్లాలంటే కనీసం3 గంటలు పడుతుందన్నారు. .దీని వలన సమయం వథా అవుతుందన్నారు. గత ప్రభుత్వం లో నూతన జిల్లాలు ఏర్పాటు చేసే సమయంలో ప్రజలు అభిప్రాయ సేకరణ చేస్తామని చెప్పి అర్జీలు స్వీకరించి ప్రజలు అభిప్రాయ సేకరణ చేయకుండానే క్రొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని దగ్గరగా ఉండే కాకినాడ జిల్లాలో కలపాలని గతంలో పోరాటం చేశామని. గత పాలకులు ఆ పోరాటానికి ఆటంకాలు కలిగించారని అన్నారు. అయితే రామచంద్రపురం నియోజకవర్గం లో ఉన్న మూడు మండలాలు అనగా రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు ఉండగా కేవలం కాజులూరు మండలాన్ని మాత్రమే గత పాలకులు తమ స్వార్థంతో కాకినాడ జిల్లాలో కలిపి మిగిలిన రెండు మండలాలను కలపకుండా నియోజకవర్గం ప్రజలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు . ఇప్పటికైనా నియోజకవర్గం ప్రజలు స్పందించి మన పిల్లలు భవిష్యత్తు కొరకు కాకినాడ జిల్లాలో కలుపుట కొరకు పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


రైతు పొలంలో నీటి కుంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

నీటి కుంటలతో మెరుగైన ఆదాయం

ప్రజాశక్తి - శంఖవరం

ఉద్యాన రైతులు నీటి కుంటలతో మెరుగైన ఆదాయ వనరులను పెంపొందించుకోవచ్చని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. బుధవారం మండలంలోని కత్తిపూడి గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో ఉద్యాన రైతు గాబు జనార్ధనరావు పొలంలో నిర్మించిన నీటి కుంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతుతో మాట్లాడి సాగు చేస్తున్న ఉద్యాన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి కొబ్బరి మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షపు నీరు వృధాగా పోకుండా భూమిలోకి ఇంకించేందుకు నీటి కుంటలు ఉపయోగపడతాయని అన్నారు. వీటి ద్వారా ఉద్యాన రైతులు మెరుగైన ఆదాయ వనరులను పెంపొందించుకోవచ్చని తెలిపారు. అయితే జిల్లాలో 2,500 నీటి కుంటలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 860 నీటి కుంటలు నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఉద్యాన రైతులకు బహుళ ఆదాయాన్ని అందించే నీటి కుంటలను జిల్లాలో ప్రతి రైతు విధిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఎంపిడిఒ లక్ష్మి రెడ్డి, ఎపిడి పి.జగదాంబ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో సుపరిపాలన

ప్రజాశక్తి - మండపేట


పాల్గొన్న మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల

పట్టణంలోని 2,3 వార్డులలో బుధవారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో అభివృద్ధిని మరిచారని వార్డులలో కనీస వసతులు కూడా పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివద్ధి సంక్షేమం చేస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అద్దంకివారిలంక జగ్జీవన్ నగర్ కు చెందిన వైసిపి కార్యకర్తలు బుధవారం టిడిపిలో చేరారు. స్థానిక గ్రామ టిడిపి అధ్యక్షులు గాలిదేవర వసంతరాయుడు ఆధ్వర్యంలో మండపేట పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో వైసిపి కార్యకర్తలు వీడి టిడిపిలో చేరారు. టిడిపిలో చేరిన వారిలో మల్లిపూడి లక్ష్మణరావు, మల్లిపూడి సత్యనారా యణ, మల్లిపూడి ఏడుకొండలు, మల్లిపూడి ఏసు, మల్లిపూడి ఆనందరావు, మల్లిపూడి చిన అర్జున్న, మల్లిపూడి గంగయ్య, మల్లిపూడి జార్జి, మల్లిపూడి చిన ఏడుకొండలు ఉన్నారు. వీరందరికీ ఎంఎల్‌ఎ వేగుళ్ళ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబుపాల్గొన్నారు.

వైద్యానికి ఆదిత్య వాలంటీర్ల విరాళం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెంలో ఉన్న ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దాతృత్వాన్ని చాటుకున్నారు. భీమవరం పట్టణానికి చెందిన కె.విహాంత్ అర్జున్ అనే బాలుడు విజయవాడలో క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ పాకెట్ మనీ నుంచి కొంత సొమ్మును సేకరించి సుమారు రూ.68 వేలను యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డికి అందజేశారు. వాలంటీర్లు సేకరించిన సొమ్మును త్వరలోనే బాలుడి కుటుంబీకులకు అందజేస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ డి.కిషోర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఐవి. వీరాంజనేయులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

ప్రజాశక్తి - శంఖవరం

రత్నగిరిపై సత్య దేవుని పాత కల్యాణ మండపంలో ఉద్యోగులకు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ తన దైనందిన జీవితంలో ఎన్నో మానసిక ఒత్తుడులకు గురౌతారని, అటువంటి వారు తప్పనిసరిగా యోగాపై దృష్టి సారించాలని అన్నారు. తద్వారా మానసిక ప్రశాంతతను పొందుతారని అన్నారు. కావున ప్రతీరోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని ఆయన సూచించారు.